వాయిస్ ఆఫ్ ప్రజలు
# వాయిస్ టుడే
TGTEL/25/A2649
VOICE OF PRAJALU
తెలుగు దినపత్రిక
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 10
బుధవారం, మార్చి 4, 2026
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## టెహ్రాన్ నుంచి భారత విద్యార్థుల తరలింపు



టెహ్రాన్: ఇరాన్-అమెరికా యుద్ధంతో తీవ్ర భయాందోళనలు నెలకొన్న ఇరాన్ రాజధాని టెహ్రాన్ నుంచి చాలామంది భారత విద్యార్థులను ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు ఆ దేశంలోని మన దౌత్య కార్యాలయం మంగళవారం తెలిపింది. రవాణా, ఆహారం, ఇతర సదుపాయాలు కల్పించినట్టు పేర్కొంది. అయితే కొద్దిమంది విద్యార్థులు వేరే ప్రాంతానికి రావడానికి అయిష్టత వ్యక్తం చేశారని, తాము టెహ్రాన్‌లోనే ఉంటామని చెప్పారని తెలిపింది. యుద్ధం కారణంగా ఏర్పడే ముప్పును తప్పించడానికే విద్యార్థులను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్నట్టు పేర్కొంది.



పశ్చిమాసియాలో




టెహ్రాన్, బీరుట్‌లపై అమెరికా-ఇజ్రాయెల్ సమన్వయ దాడులు

# యుద్ధ జ్వాలలు

### ఇరాన్ అధ్యక్ష భవనం, కీలక అణు కేంద్రాలు లక్ష్యంగా క్షిపణులు

- లెబనాన్‌లోకి ఇజ్రాయెల్ భూసేనల ప్రవేశం, హెజ్‌బొల్లా ప్రతిస్పందన
- గల్ఫ్ దేశాల్లో అమెరికా ఎంబసీలు, స్థావరాలపై ఇరాన్ డ్రోన్ దాడులు
- హర్మూజ్ జలసంధి మూసివేత ప్రకటనతో చమురు రవాణా స్థంభనం
- యుద్ధంలో వందలాది మృతులు, విదేశీయుల్లో భారతీయులూ బలిపాటు
- ప్రపంచ దేశాల ఆందోళన, పౌరుల తరలింపుకు అత్యవసర చర్యలు





**ఇరాన్ తాజాగా చర్చలకు ప్రయత్నించింది**
**ఇప్పటికే చాలా ఆలస్యమైందని చెప్పాను: ట్రంప్**

టెహ్రాన్/బీరుట్, అంతర్జాతీయ వార్తా విభాగం: పశ్చిమాసియాలో యుద్ధం భీకరరూపం దాల్చింది. నాలుగో రోజుకు చేరుకున్న ఘర్షణలు మరింత ఉద్ధృతమయ్యాయి. ఇరాన్, లెబనాన్‌లపై అమెరికాఇజ్రాయెల్ దళాలు సమన్వయంగా దాడులు చేపట్టగా, ప్రతిస్పందనగా ఇరాన్ గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా ప్రయోజనాలను లక్ష్యంగా చేసుకుంది. టెహ్రాన్‌లోని అధ్యక్ష భవనం, సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యాలయాలతోపాటు రెండు అణు కేంద్రాలపై క్షిపణులు దూసుకెళ్లాయి. సుప్రీం లీడర్ ఎన్నికలకు సంబంధించిన అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ కార్యాలయం పూర్తిగా ధ్వంసమైంది. ఇజ్రాయెల్ దళాలు హెజ్‌బొల్లా స్థావరాలపై వైమానిక దాడులు కొనసాగిస్తూ దక్షిణ లెబనాన్‌లోకి భూసేనలను దింపాయి. బీరుట్ శివార్లలోని దహియెహ్ ప్రాంతం పొగమంచుతో కమ్ముకుంది. ఏడాదిగా సహనం పాటించామని, ఇక బహిరంగ యుద్ధానికే సిద్ధమని హెజ్‌బొల్లా ప్రకటించింది. ఇజ్రాయెల్‌లోని రమత్ డేవిడ్

(మిగతా 2వ పేజీలో)

# ముఖగుర్తింపు తప్పనిసరి

- ప్రభుత్వ పథకాల అమలులో సాంకేతికతకు ప్రాధాన్యం
- ఆసరా నుంచి 3 లక్షల అనర్హుల తొలగింపు వెల్లడించిన సీఎం
- నెలలో 10 రోజులు క్షేత్ర పర్యటనలపై కలెక్టర్లకు ఆదేశం
- అక్రమ ఇసుక, మైనింగ్‌పై కలెక్టర్, ఎస్పీ సస్పెన్షన్ హెచ్చరిక
- 99 రోజుల కార్యాచరణకు కఠిన పర్యవేక్షణ
- పాఠశాలలు, ఆస్పత్రుల నిర్వహణపై జీరో టాలరెన్స్



హైదరాబాద్: రాష్ట్రంలో ప్రతి ప్రభుత్వ పథకం అర్హులకే చేరేలా ముఖ గుర్తింపు సాంకేతికతను తప్పనిసరిగా వినియోగించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సాంకేతికత సద్వినియోగం ద్వారా లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఆసరా పెన్షన్ పథకంలో ఇప్పటికే ఫేషియల్ రికగ్నిషన్ అమలు చేసి 3 లక్షల అనర్హులను తొలగించినట్లు వెల్లడించారు. అర్హులకు న్యాయం, అనర్హులకు నిరోధం అనే లక్ష్యంతో ముందుకు సాగాలని అధికారులకు

(మిగతా 2వ పేజీలో)



## తెలంగాణ ఖజానా స్థితిగతులు ప్రజలకు వెల్లడించాలి: కిషన్‌రెడ్డి


- ఖాళీ ఖజానా అంటూనే గాంధీ కుటుంబానికి వెయ్యి కోట్లు ఎలా? అంటూ ప్రశ్న
- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనల వల్లే అప్పుల భారం పెరిగిందని విమర్శ
- వడ్డీల చెల్లింపులు, జీతాలకే రుణాలపై ఆధారపడుతోందని ఆక్షేపణ
- బడ్జెట్ సమావేశాలకుముందే నివేదిక ఇవ్వాలని లేఖ

న్యూఢిల్లీ, మార్చి 3 : తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం లేఖ రాశారు. రాష్ట్ర ఖజానా స్థితిగతులపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. మార్చి 16న ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాలకు ముందుగానే పూర్తి స్థాయి ఆర్థిక నివేదికను ప్రజల ముందుంచాలని

(మిగతా 2వ పేజీలో)

## 5న వాదనలు ముగించండి

- 'కాళేశ్వరం' కమిషన్‌పై పిటిషన్లలో హైకోర్టు స్పష్టీకరణ
- ప్రభుత్వంపిటిషనర్లకు సమయపట్టిక ఖరారు
- పిటిషనర్లపై చర్యలొద్దని మధ్యంతర ఉత్తర్వుల పొడిగింపు
- ప్రజాప్రయోజనాల కోసమే కమిషన్ ఏర్పాటు: ఏజీ వాదనలు
- నివేదిక పత్రాధారాలపైనే ఆధారమని స్పష్టం




హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ నివేదికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లలో గురువారం (5న) వాదనలు ముగించాలని హైకోర్టు ఆదేశించింది. రోజుల తరబడి వాదనలు సాగించడం సరికాదని పేర్కొంటూ, క్లుప్తంగా తమ వాదనలు సమర్పించాలని ఇరుపక్షాల న్యాయవాదులకు సూచించింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం మంగళవారం ఈ కేసును మరోసారి విచారించింది. మధ్యాహ్నం 12.30 నుంచి 2.45 గంటల వరకు ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించాలని, అనంతరం పిటిషనర్ల తరఫున న్యాయవాదులు తమ వాదనలు పూర్తి చేయాలని కోర్టు స్పష్టం చేసింది. అప్పటివరకు పిటిషనర్లపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపిన కమిషన్ నివేదికపై

(మిగతా 2వ పేజీలో)



## నలుగురు బీసీ నేతలు రాజ్యసభ అవకాశం కోరుతున్నారు: మహేశ్‌గౌడ్

- కార్పొరేట్లకే బీఆర్ఎస్ రాజ్యసభ అవకాశం ఇచ్చిందన్న మహేశ్ గౌడ్
- తెలంగాణ కోసం పోరాడిన వారిని విస్మరించిందని విమర్శ
- లొంగిపోయిన మావోలు కాంగ్రెస్‌లోకి వస్తే ఆహ్వానిస్తామని వ్యాఖ్య



## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అరెస్టు.. చేతికి స్వల్ప గాయం!

- నార్సింగిలోని ఒక వెంచర్ వద్ద ఆందోళన చేపట్టిన కవిత
- హైడ్రా వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని హెచ్చరిక
- కవితతోపాటు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

## ముగిసిన అరుదైన చంద్రగ్రహణం... తిరిగి తెరుచుకున్న శ్రీవారి ఆలయం



- ఆకాశంలో కనువిందు చేసిన సంపూర్ణ చంద్రగ్రహణం
- రక్త వర్ణంలో దర్శనమిచ్చిన చందమామ
- భారత్‌లో చంద్రోదయం తర్వాత కనిపించిన గ్రహణం
- గ్రహణం సందర్భంగా పలు ఆలయాల మూసివేత

వాయిస్ టుడే
బుధవారం, మార్చి 4, 2026

# పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు




వైమానిక స్థావరంపై డ్రోన్ దాడులు చేశామని ఆ సంస్థ వెల్లడించగా, వాటిని తిప్పికొట్టామని ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. మరోవైపు రియాద్, కువైట్‌లలోని అమెరికా ఎంబసీలపై ఇరాన్ డ్రోన్లతో దాడి చేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బహ్రెయిన్‌లలోని డేటా సెంటర్లపైనా దాడులు జరిగినట్లు సమాచారం. బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక స్థావరంపై క్షిపణులు ప్రయోగించడంతో అమెరికా సైనికుల్లో ఆరుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు. యుద్ధ ప్రభావం సముద్ర మార్గాలపైనా పడింది. హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించడంతో ప్రపంచ చమురు సరఫరాలో ఆందోళన నెలకొంది. ఈ మార్గంలో సుమారు ఏడు వందల చమురు నౌకలు నిలిచిపోయాయి. పర్షియన్ గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్ ప్రాంతాల్లో అనేక దేశాల వాణిజ్య నౌకలు చిక్కుకుపోయాయి. ఒక విదేశీ జెండా నౌకపై జరిగిన దాడిలో ముగ్గురు భారతీయ సిబ్బంది మృతి చెందినట్లు ధృవీకరించబడింది. ఇప్పటివరకు ఇరాన్‌లో వందల సంఖ్యలో ప్రాణనష్టం సంభవించగా, లెబనాన్‌లో కూడా మృతుల సంఖ్య పెరుగుతోంది. కెర్మన్ వైమానిక స్థావరంపై జరిగిన దాడిలో ఇరాన్ సైనిక సిబ్బంది మరణించినట్లు సమాచారం. దోహా విమానాశ్రయంపై దాడులకు ప్రతీకారంగా ఇరాన్‌పై చర్యలు చేపట్టినట్లు ఖతార్ ప్రకటించినప్పటికీ వివరాలు వెల్లడించలేదు. పరిస్థితి విషమించడంతో పశ్చిమాసియా దేశాల గగనతలాలు పాక్షికంగా మూసివేయబడ్డాయి. గల్ఫ్ ప్రాంతంలోని తమ పౌరులను అమెరికా తరలిస్తుండగా, ఐరోపా దేశాలు కూడా అత్యవసర ఏర్పాట్లు చేస్తున్నాయి. సైప్రస్‌లోని సైనిక స్థావరాల రక్షణకు యుద్ధ నౌకలను పంపుతున్నట్లు బ్రిటన్, ఫ్రాన్స్ వెల్లడించాయి. ఇరాన్ అణు కార్యక్రమ పునరుద్ధరణే ఈ దాడులకు కారణమని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు. తమ ఎంబసీలపై దాడులకు గట్టి ప్రతిస్పందన ఉంటుందని అమెరికా అధ్యక్షుడు హెచ్చరించారు. ఈ యుద్ధం ప్రాంతీయ ఘర్షణగా పరిమితం అవుతుందా, లేక మరింత విస్తరిస్తుందా అన్న ఆందోళన అంతర్జాతీయ వేదికలపై వ్యక్తమవుతోంది.

## ఇరాన్ తాజాగా చర్చలకు ప్రయత్నించింది... ఇప్పటికే చాలా ఆలస్యమైందని చెప్పాను: ట్రంప్

**ట్రూత్ సోషల్ లో ట్రంప్ పోస్ట్**

**ఇరాన్ వాయుసేన, నావికాదళం, రక్షణ వ్యవస్థలు ధ్వంసమైనట్లు వెల్లడి**

**ఆ దేశ నాయకత్వం కూడా తుడిచిపెట్టుకుపోయిందన్న అమెరికా అధ్యక్షుడు**

యుద్ధం మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ తాజాగా తమతో చర్చలు జరిపేందుకు సిద్ధమైందని, కానీ అందుకు సమయం మించిపోయిందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య భీకర దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ట్రంప్ తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ఈ విషయంపై స్పందించారు. "ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ (వాయు రక్షణ వ్యవస్థ), ఎయిర్ ఫోర్స్ (వాయుసేన), నేవీ (నావికాదళం) తుడిచిపెట్టుకుపోయాయి.



ఇరాన్ నాయకత్వాన్ని తుదముట్టించాం. ఇప్పుడు వారు మాతో మాట్లాడాలని కోరుకుంటున్నారు. తాజాగా ఇరాన్ చర్చలు జరిపేందుకు ప్రయత్నించింది. దానికి నేను 'టూ లేట్' (ఇప్పటికే చాలా ఆలస్యమైంది) అని సమాధానమిచ్చాను" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. వాషింగ్టన్ పోస్ట్‌లో 'ట్రంప్ డాక్ట్రిన్' పేరుతో వచ్చిన ఒక విశ్లేషణాత్మక కథనానికి స్పందనగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం తీవ్ర స్థాయికి చేరుకోగా, అమెరికా సైనిక చర్యలు కొనసాగుతున్నాయి. ఇరాన్ సైనిక శక్తి, నాయకత్వం తీవ్రంగా నష్టపోయాయని, యుద్ధం మరికొన్ని వారాల పాటు కొనసాగే అవకాశం ఉందని ట్రంప్ అంచనా వేశారు. అమెరికా సైనిక శక్తి తిరుగులేనిదని ఆయన పునరుద్ఘాటించారు.

# ముఖగుర్తింపు తప్పనిసరి



దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సు ముగింపు కార్యక్రమంలో సీఎం విస్తృతంగా మాట్లాడారు. ప్రతి కలెక్టర్ నెలలో కనీసం 10 రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, ప్రజల మధ్య ఉండి పథకాల అమలు పర్యవేక్షించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పని చేయని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రేషన్ బియ్యం రికవరీ విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రూ.3,900 కోట్ల విలువైన బియ్యం మిల్లర్ల వద్దే నిల్వ ఉన్నదని పేర్కొంటూ అవసరమైతే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అక్రమ ఇసుక, మైనింగ్ జరుగుతున్నట్లు తేలితే సంబంధిత జిల్లా కలెక్టర్, ఎస్పీపై సస్పెన్షన్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు నిర్వహించనున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను ఫలితాల దిశగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ మూడు నెలల పనితీరు అధికారుల సేవా ప్రస్థానానికి కొలమానం అవుతుందని పేర్కొన్నారు. పనితీరు ఆధారంగా అవార్డులు, రివార్డులు ఉంటాయని తెలిపారు. జూన్‌లో మరోసారి సమీక్షా సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. తెలంగాణ రైజింగ్ విజన్ అమలులో కలెక్టర్లు నూటికి నూరు శాతం భాగస్వాములు కావాలని సూచించారు. రీజనల్ రింగ్ రోడ్, ఫ్యూచర్ సిటీ, మామునూర్, ఆదిలాబాద్ విమానాశ్రయాల భూసేకరణ వేగవంతం చేయాలని ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం పెంపొందించి అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. గ్రామసభల ద్వారా సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను ప్రజలకు వెల్లడించాలని ఆదేశించారు. మహాలక్ష్మి, గృహజ్యోతి, రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను గ్రామాల వారీగా సిద్ధం చేయాలని చెప్పారు. పునరుత్పాదక విద్యుత్‌పై అవగాహన కల్పిస్తూ పాఠశాలలపై సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పర్యవేక్షించాలని, జిల్లా కలెక్టర్లు వారానికి ఒకసారి విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని చెప్పారు. నిర్లక్ష్యం చేస్తే డీఈఓలతో పాటు కలెక్టర్లపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవల నాణ్యత పెంపుపై దృష్టి సారించాలని సూచించారు. సీఎంఆర్ఎఫ్, ఆరోగ్యశ్రీ ద్వారా భారీగా నిధులు ఖర్చు చేస్తున్నందున సేవలలో లోపాలు సహించబోమన్నారు. వైద్య కళాశాలలను ఆసుపత్రులతో అనుసంధానం చేస్తామని వెల్లడించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వ్యవహారంలో అక్రమాలను బయటపెట్టాలని ఆదేశించారు. దాదాపు 25 వేల బోగస్ ఉద్యోగులను గుర్తించినట్లు పేర్కొంటూ సంబంధిత ఏజెన్సీలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించి కేసులు నమోదు చేయాలని సూచించారు. పాఠశాల బస్సుల ఫిట్‌నెస్, రహదారుల గుంతల మరమ్మతులు, డ్రగ్స్ నియంత్రణ, వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల పర్యవేక్షణ వంటి అంశాలపై కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజా పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం ప్రధాన లక్ష్యాలుగా ముందుకు సాగాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఒమన్ సుల్తాన్, కువైట్ యువరాజుతో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ

**భారతీయుల భద్రతపై వారితో చర్చించినట్లు ప్రధాని కార్యాలయం వెల్లడి**

**గల్ఫ్ దేశాల మీద జరుగుతున్న దాడులపై ప్రధాని ఆందోళన**

**చర్చలు, దౌత్య మార్గాల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలన్న విదేశాంగ శాఖ**



ఇరాన్, ఇజ్రాయెల్–అమెరికా యుద్ధం నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒమన్ సుల్తాన్, కువైట్ యువరాజుతో ఫోన్‌లో సంభాషించారు. గల్ఫ్‌లో కొనసాగుతున్నసంఘర్షణ, ఈ ప్రాంతాల్లోని భారతీయుల భద్రతపై వారితో చర్చించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. కువైట్ యువరాజు సబా అల్ ఖలీద్ అల్ సబాతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. గల్ఫ్ దేశాలపై జరుగుతున్న దాడుల మీద ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒమన్ సుల్తాన్‌తోనూ ప్రధాని మోదీ మాట్లాడారని ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. చర్చలు, దౌత్య మార్గాల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని భారత్ పిలుపునిస్తోందని విదేశాంగ మంత్రిత్వ శాఖ పునరుద్ఘాటించింది. ఇరుపక్షాలు సంయమనం పాటించాలని, ఉద్రిక్తతలను నివారించాలని కోరింది. పౌరుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది.

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అరెస్టు.. చేతికి స్వల్ప గాయం!

**నార్సింగిలోని ఒక వెంచర్ వద్ద ఆందోళన చేపట్టిన కవిత**

**హైడ్రా వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని హెచ్చరిక**

**పలువురు కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు**



తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్టు చేశారు. నార్సింగిలోని ఒక వెంచర్ వద్ద స్థానికులతో కలిసి ఆమె ఆందోళన చేపట్టారు. హైడ్రాకు రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమ వెంచర్లు కనిపించడం లేదా అంటూ ఆమె నిలదీశారు. హైడ్రా బుల్డోజర్లను పంపించే వరకు తాము ఆందోళన విరమించేది లేదని ఆమె హెచ్చరించారు. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న పోలీసులు కవితను అదుపులోకి తీసుకున్నారు. ఆమెను అదుపులోకి తీసుకుని పోలీసు వాహనాల్లో ఎక్కిస్తుండగా తెలంగాణ జాగృతి కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు, కార్యకర్తలకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. కార్యకర్తలు 'వుయ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేశారు. అక్రమ వెంచర్లను కూల్చడానికి హైడ్రా, రంగనాథ్ రావాలని వారు డిమాండ్ చేశారు. కవితతో పాటు పలువురు జాగృతి కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసులు నార్సింగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు చేసే సమయంలో కవిత చేతికి స్వల్ప గాయమైంది.

## ముగిసిన అరుదైన చంద్రగ్రహణం... తిరిగి తెరుచుకున్న శ్రీవారి ఆలయం

ఆకాశంలో ఓ అద్భుత ఖగోళ దృశ్యం కనువిందు చేసింది. ఈ ఏడాది తొలి సంపూర్ణ చంద్రగ్రహణం ప్రపంచవ్యాప్తంగా వీక్షకులను అలరించింది. భూమి నీడ చంద్రుడిపై పడటంతో, జాబిల్లి పూర్తి ఎర్ర రంగులోకి మారి 'బ్లడ్ మూన్' (రక్త చంద్రుడు)గా దర్శనమిచ్చింది. భారత్‌లోనూ ఈ చంద్రగ్రహణం పలు ప్రాంతాల్లో స్పష్టంగా కనిపించింది. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3:20 గంటల తర్వాత గ్రహణం ప్రారంభమైనప్పటికీ, ఆ సమయంలో చంద్రుడు దిగంతానికి దిగువన ఉండటంతో మన దేశంలో కనిపించలేదు. సాయంత్రం 6:26 గంటలకు చంద్రోదయం తర్వాతే గ్రహణాన్ని వీక్షించే అవకాశం లభించింది. ముఖ్యంగా సాయంత్రం 6:33 నుంచి 6:40 గంటల మధ్యలో గ్రహణం గరిష్ఠ స్థాయికి చేరినప్పుడు, చంద్రుడు తూర్పు దిక్కున ఎర్రని నారింజ రంగులో అద్భుతంగా కనిపించాడు. రాత్రి 6:47 గంటలకు గ్రహణం పూర్తిగా ముగిసింది. దేశంలోని మధ్య, పశ్చిమ ప్రాంతాలైన ఇండోర్ వంటి నగరాల్లో చంద్రోదయం సమయంలోనే గ్రహణం గరిష్ఠ దశలో ఉండటంతో, ప్రజలు ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించారు. ఈ ఖగోళ వింతను చూడటానికి ఎలాంటి ప్రత్యేక పరికరాలు అవసరం లేకపోయింది. చంద్రగ్రహణం సందర్భంగా దేశవ్యాప్తంగా హిందూ సంప్రదాయాల ప్రకారం 'సూతక్ కాలం' పాటించారు. ఉదయం గ్రహణం ప్రారంభానికి ముందే సూతక్ మొదలై, సాయంత్రం 6:47 గంటలకు గ్రహణం ముగిశాక పూర్తయింది. ఈ సమయంలో చాలామంది శుభకార్యాలకు దూరంగా ఉండి, ఉపవాసాలు పాటించారు. తిరుపతి వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఆలయాలను మూసివేశారు. సూర్యుడికి, చంద్రుడికి మధ్య భూమి వచ్చినప్పుడు చంద్రగ్రహణం ఏర్పడుతుంది. మళ్లీ ఇటువంటి సంపూర్ణ చంద్రగ్రహణం 2028 చివరి వరకు కనిపించదని శాస్త్రవేత్తలు తెలిపారు. దీంతో ఈ అరుదైన దృశ్యాన్ని చాలా మంది తమ కెమెరాల్లో బంధించి సోషల్ మీడియాలో పంచుకున్నారు. చంద్రగ్రహణం కారణంగా మంగళవారం ఉదయం మూసివేసిన తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయ ద్వారాలు రాత్రి తిరిగి తెరుచుకున్నాయి. గ్రహణం ముగిసిన అనంతరం ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం వంటి కైంకర్యాలు పూర్తి చేసి రాత్రి 8 గంటల నుంచి భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. మంగళవారం మధ్యాహ్నం 3:26 గంటల నుంచి సాయంత్రం 6:47 గంటల వరకు చంద్రగ్రహణం కొనసాగింది. ఆగమశాస్త్ర నియమాల ప్రకారం, గ్రహణానికి ఆరు గంటల ముందుగానే అంటే ఉదయం 9 గంటలకే ఆలయ తలుపులను మూసివేశారు. గ్రహణం పూర్తయిన తర్వాత రాత్రి 7:30 గంటలకు ఆలయ ద్వారాలను తెరిచి, శుద్ధి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తుల దర్శనాలతో పాటు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో అన్నప్రసాద వితరణ కూడా తిరిగి ప్రారంభమైంది. రాత్రి 8:30 గంటల నుంచి భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. అదేవిధంగా, లడ్డూ విక్రయ కౌంటర్లను కూడా తెరిచి భక్తులకు అందుబాటులో ఉంచారు. దీంతో గ్రహణం కారణంగా రోజంతా శ్రీవారి దర్శనానికి దూరమైన భక్తులు రాత్రి నుంచి స్వామివారిని దర్శించుకుంటున్నారు.

## తెలంగాణ ఖజానా స్థితిగతులు ప్రజలకు వెల్లడించాలి: కిషన్‌రెడ్డి

డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, వందలాది హామీలతో అధికారంలోకి వచ్చిందని గుర్తుచేసిన కిషన్‌రెడ్డి, ఇప్పుడు హామీలు అమలు చేయాలంటే ఖజానాలో నిధులు లేవని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. ఖజానా ఖాళీగా ఉందని చెప్పే ప్రభుత్వం, అవసరమైతే గాంధీ కుటుంబానికి వెయ్యి కోట్లు ఇస్తామని ప్రకటించడం విరుద్ధ వ్యాఖ్యలేనని ప్రశ్నించారు. మిగులు రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణను పదేళ్ల బీఆర్ఎస్ పాలన అప్పుల కుప్పగా మార్చిందని, ఆ తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆర్థిక క్రమశిక్షణ పాటించలేదని ఆరోపించారు. గత 27 నెలల్లో రాష్ట్ర ఆర్థిక స్థితి మరింత దిగజారిందని విమర్శించారు. వడ్డీల చెల్లింపులు, ఉద్యోగుల జీతాలు, రైతు భరోసా నిధులు, సంక్షేమ పథకాల అమలుకు సైతం ప్రభుత్వం అప్పులపైనే ఆధారపడుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమానికీ కేంద్రం అందిస్తున్న వడ్డీలేని రుణాలపై ఆధారపడటం ఆర్థిక బలహీనతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఎస్ఏఎస్సీఐ పథకం కింద గత ఐదేళ్లలో రాష్ట్రానికి వడ్డీలేని రుణాలుగా పది వేల కోట్లకు పైగా నిధులు అందించామని వివరించారు. ఈ నిధులతో రహదారి విస్తరణలు, విద్యా సంస్థల అభివృద్ధి, ఓఆర్ఆర్ఆర్ఆర్ మధ్య రేడియల్ రోడ్లు, గోదావరిమూసీ అనుసంధానం వంటి ప్రాజెక్టులు చేపట్టినట్లు తెలిపారు. 2014 నుంచి ఇప్పటివరకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు దాదాపు 12 లక్షల కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలపై పారదర్శకత అవసరమని, ఆదాయవ్యయాలు, అప్పులు, వడ్డీభారం, భవిష్యత్ బాధ్యతలు వంటి అంశాలపై స్పష్టమైన వివరాలు ప్రజలకు తెలియజేయాలని లేఖలో కోరారు. తెలంగాణ ప్రజలకు నిజమైన ఆర్థిక దృశ్యం తెలియాలంటే శ్వేతపత్రం తప్పనిసరని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక స్థిరత్వంపై ప్రభుత్వ వైఖరి ఏమిటో వెల్లడించాలని, బడ్జెట్ సమావేశాల ముందు సమగ్ర నివేదిక విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## 5న వాదనలు ముగించండి

అసెంబ్లీలో చర్చించినా, ఎటువంటి చర్యలు తీసుకోకుండా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ సీఎస్ శైలేంద్రకుమార్ జోషి, మాజీ సీఎం ప్రత్యేక కార్యదర్శి స్మితా సబర్వాల్ పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, కమిషన్ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, కేంద్ర జల కమిషన్ తదితర సంస్థల నుంచి అందిన పత్రాల ఆధారంగా సమగ్ర నివేదిక సమర్పించిందన్నారు. ఎవరినీ లక్ష్యంగా చేసుకుని లేదా నిర్బంధించేందుకు కమిషన్ వ్యవహరించలేదని స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనాల రక్షణ కోసం ఏ ప్రాజెక్టుపైనైనా విచారణ కమిషన్‌ను నియమించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని ఏజీ పేర్కొన్నారు. కమిషన్ ఏర్పాటును తప్పుబట్టడం తగదని వ్యాఖ్యానించారు. కేబినెట్ సబ్‌కమిటీ ఆమోదం లేకుండా నాటి సీఎం, నీటిపారుదల ముఖ్య కార్యదర్శి సంతకాలతో వేల కోట్ల రూపాయలు విడుదల చేయడం నిబంధనలకు విరుద్ధమని వాదించారు. రూ.1.47 లక్షల కోట్ల అంచనాతో నిర్మితమైన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాగ్ ఆక్షేపణలను ప్రస్తావిస్తూ, ఎకరాకు అధిక వ్యయం జరిగినట్లు తెలిపారు. ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ వినియోగం కారణంగా రాష్ట్రంపై అదనపు ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. ఈ అంశాలపై సుప్రీంకోర్టు పూర్వ తీర్పులను ఉదహరించారు. గురువారం వాదనలు ముగియనున్న నేపథ్యంలో హైకోర్టు నిర్ణయం కీలకంగా మారింది. కేసు తుది పరిణామాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## నలుగురు బీసీ నేతలు రాజ్యసభ అవకాశం కోరుతున్నారు: మహేశ్‌గౌడ్

తెలంగాణ రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సమర్థులైన నలుగురు బీసీ నేతలు రాజ్యసభ అవకాశం కోరుతున్నారని, ఒకటి లేదా రెండు స్థానాల కేటాయింపుపై రేపు స్పష్టత వస్తుందని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ కేవలం కార్పొరేట్ శక్తులకే పెద్దల సభలో అవకాశం ఇచ్చిందని, తెలంగాణ కోసం పోరాడిన వారిని విస్మరించిందని ఆయన విమర్శించారు. అలాగే, మార్చి నెలలో కార్పొరేషన్ పదవుల భర్తీ ఉంటుందని వెల్లడించారు. మావోయిస్టుల అంశంపై స్పందిస్తూ... దశాబ్దాలుగా సిద్ధాంతం కోసం పనిచేస్తున్న వారి పట్ల తమకు గౌరవం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పాకిస్థాన్‌తో చర్చలకు సిద్ధపడి, మావోయిస్టులతో చర్చలకు నిరాకరించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఆపరేషన్ కగార్‌ను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని పేర్కొంటూ, లొంగిపోయిన మావోయిస్టులు కాంగ్రెస్ పార్టీలోకి వస్తే సాదరంగా ఆహ్వానిస్తామని స్పష్టం చేశారు.

# ఇందిరమ్మ రాజ్యంలో పేదల ఇల్లు కూల్చడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందా: రాకేష్ గైక్వాడ్



హైదరాబాద్, మార్చి 03: నార్సింగిలో మూసీ నదిని ఆక్రమించి నిర్మిస్తోన్న భారీ రియల్ ఎస్టేట్ వెంచర్ పై చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికులతో కలసి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ధర్నా చేపట్టారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టులో భాగంగా ప్రజల నివాసాలు తొలగిస్తామని చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, పేదల ఇండ్లు కూల్చేసే హైడ్రాకు ఈ అక్రమ వెంచర్ కనిపించడం లేదా అని ప్రశ్నించిన హరిబోలి డివిజన్ తెలంగాణ జాగృతి యువ నాయకులు రాకేష్ గైక్వాడ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని ఇందిరమ్మ రాజ్యంలో పేద బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేకూరుస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే చెప్పిన ఎన్నికల్లో ఇచ్చిన మాటలు ఎక్కడ అని ప్రశ్నించారు. పేదల భూములను తీసుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి, మంత్రులు పేదల భూములను తీసుకోవడమే ప్రజా పాలనకు అర్థమ? ప్రజాపాలనంటే ఇదేనా అని ప్రశ్నించారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేదల పక్షాన ప్రశ్నిస్తున్న అధికారులకు ముఖ్యమంత్రి, మంత్రులకు ప్రజాసమస్యలు కనపడటలేవా వినపడటం లేవా అని అన్నారు. పేదల పక్షాన తెలంగాణ జాగృతి ఎప్పుడు ముందుంటుందని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి నాయకులు కఠినమైన ఆస్థానా,శ్రీకర్ శర్మ, రాజు, కుమార్, ఓంకార్ స్వామి, నిలయ్ భూషణ్ రాయ్, ఆస్థానా నితిన్, నవీన్, రూప్ సింగ్, సచిన్, శశి, పల్లవి,ముఖేష్, రాహుల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



# అంబర్పేట్ లో అంబరానంటిన హోలీ సంబరాలు

### టీం యశ్వంత్ ఆధ్వర్యంలో అంబర్పేట్లో గ్రాండ్గా హోలీ సెలబ్రేషన్స్

హైదరాబాద్ : మార్చి 03;( వాయిస్ టూ డే): హైదరాబాద్ అంబర్పేట్ లో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. బీజేవైఎం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, అంబర్పేట్ కంటెస్టెంట్ కార్పొరేటర్ యశ్వంత్ ఆధ్వర్యంలో టీం యశ్వంత్ పేరుతో హోలీ సెలబ్రేషన్స్ గ్రాండ్ గా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్య కిషన్ రెడ్డి పాల్గొని మహిళలతో కలిసి రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. డీజే పాటలకు డాన్సులు చేస్తూ చిన్న పెద్ద కలర్లు చల్లుకున్నారు. ఈ సందర్భంగా కావ్య కిషన్ రెడ్డి మాట్లాడుతూ..హోలీ పండుగ మన భారతీయ సంస్కృతిలో భాగమని దేశవ్యాప్తంగా కుల మతాలకతీతంగా జరుపుకునే పండగనీ ఈ హోలీ పండుగ అందరి జీవితాల్లో ఆనందం నింపే రంగుల పండగ కావాలని ఆమె ఆకాంక్షించారు. అందరితో కలిసి రంగులు ఆడుతూ సంతోషాన్ని పంచుకుని, ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక హోలీ శుభాకాంక్షలు తెలిపారు. యశ్వంత్ మాట్లాడుతూ.. ఈ హోలీ పండుగ మీ అందరి జీవితాల్లో ఆనందం, ఐక్యత, సుభిక్షత నింపాలని కోరుకున్నారు. ఈ సంబరాల్లో టీం యశ్వంత్ సభ్యులు పాల్గొన్నారు.



# అంబర్ పేట దేవస్థాన సేవా సమితికి ఎన్నికల తేదీని ప్రకటించాలి

### చైర్మన్, వైస్ చైర్మన్, అధ్యక్షుడికి వినతిపత్రం సమర్పించిన ప్రతినిధులు

హైదరాబాద్: మార్చి 03;(వాయిస్ టూ డే) : అంబర్ పేట దేవస్థాన సేవా సమితి కమిటీ పదవి కాలం ఇంకా 24 రోజులు మిగిలి ఉన్నందున దేవస్థాన సేవ సమితి కమిటీకి ఎన్నికల తేదీని ప్రకటించడానికి చర్యలు తీసుకోవాలని పలువురు ప్రతినిధులు దేవస్థాన సేవాసమితి చైర్మన్ పి. జ్ఞానేశ్వర్ గౌడ్, వైస్ చైర్మన్ గడ్డం లక్ష్మణ్ గౌడ్, అధ్యక్షుడు వై.శంకర్ గౌడ్ లను కలిసి వినతిపత్రం సమర్పించారు. కమిటీ ఎన్నికల గడువు ఈనెల 26వ తేదీన ముగియనున్నదని, ప్రస్తుత కమిటీ గాడు ఇంకా 24 రోజులతో మూడు సంవత్సరాలు నిండితుండదని గుర్తు చేశారు. వెంటనే ఎన్నికలు తేదీలను ప్రకటించడానికి చర్యలు తీసుకోవాలని గత ఎన్నికలలో పోటీ చేసిన సభ్యులు సి.శ్రీనివాస్ ముదిరాజ్, ఎం. శ్రీరాములు ముదిరాజ్, బి. మన్మోహన్ గౌడ్. ఎస్. కృష్ణారెడ్డి, కెంచె చంద్రశేఖర్, పి. చంద్రశేఖర్ గౌడ్, ఎడ్ల శ్రీధర్ రెడ్డి, ఆర్.కపిల్ దేవ్, ఎస్. సంజీవ చారి, అచ్చిని రమేష్. కె. అశోక్ కుమార్, వి. మహేందర్ రెడ్డిలు కోరారు.

# సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో ఘనంగా హోలీ పండుగ



కూకట్పల్లి, మార్చి 03:(వాయిస్ టుడే) : సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో హోలీ పండుగను విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థినులు, విద్యార్థులు మరియు ఏబీవీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందంగా హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.హోలీ పండుగ హిందూ సంప్రదాయాలలో ప్రత్యేక స్థానం కలిగినది. ప్రహ్లాదుడు భక్తి, హోలిక దహనం ద్వారా చెడుపై మంచికి కలిగిన విజయాన్ని సూచించే ఈ పండుగ, సత్యం--ధర్మం ఎల్లప్పుడూ గెలుస్తాయనే సందేశాన్ని ఇస్తుంది. వసంత ఋతువు ఆరంభాన్ని సూచించే హోలీ, మనుషుల మధ్య భేదాలను తొలగించి స్నేహం, ప్రేమ, ఐక్యతను పెంపొందించే సామాజిక పండుగగా భావిస్తారు.ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ భరత్ మాట్లాడుతూ యువత దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. “యువశక్తి దేశశక్తి” అనే నినాదంతో విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవలో ముందుండాలని సూచించారు.

స్వామి వివేకానంద యువతకు ఇచ్చిన సందేశాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆయన చెప్పినట్లుగా “ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్య వరాన్నిబోధత” (లేచి నిలబడి, లక్ష్యం సాధించే వరకు ఆగవద్దు) యువత ధైర్యం, క్రమశిక్షణ, దేశభక్తితో ముందుకు సాగాలని నాయకులు పేర్కొన్నారు. శారీరక దృఢత్వం, మానసిక బలం, సద్గుణాలు కలిగిన యువతే బలమైన భారతాన్ని నిర్మించగలదని వారు తెలిపారు.హోలీని పర్యావరణానికి అనుకూలంగా, సురక్షితంగా జరుపుకోవాలని, సహజ రంగులను మాత్రమే ఉపయోగించాలని మరియు నీటి వృథాను నివారించాలని ఏబీవీపీ యూనిట్ విద్యార్థులకు సూచించింది.ఈ కార్యక్రమంలో ఎబివిపి కార్యకర్తలు విశ్వవిద్యాలయ విద్యార్థులు అధిక సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

# స్టార్ గ్లోబల్ స్కూల్ విజ్ఞాన్ ఉస్తావ్



జూబ్లీహిల్స్ 03 మార్చ్. వాయిస్ టుడే: బోరబండ సైడ్ శ్రీ జయశంకర్ కమ్యూనిటీ హాల్లోని స్టార్ గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో సైన్స్ వేర్ కార్యక్రమం నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిగా తారిఖ్ అన్సారి (చైర్మన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ మైనార్టీ కమిషన్) మరియు సయ్యద్ అన్వారోల్ హుదా ఐపీఎస్ రిటైర్.. (ఫార్మర్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్..) స్కూల్ కరస్పాండెంట్ వసీమ్ ఉన్నిసా వారికీ సత్కరించారు వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సైన్స్ ఫెయిర్ విజ్ఞాన ప్రదర్శనలో మరియు సంకేతిక అభివృద్ధిని ప్రోత్సహించే వేడుకలు నిర్వహిస్తామన్నారు..సైన్స్ ఫెయిర్ (రాఎఱవఅఎవ ఖీఱఅతీ) అనేది విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని, పరిశోధనా నైపుణ్యాలను పెంపొందించడానికి నిర్వహించే ఒక వేదిక. ఇందులో విద్యార్థులు తాము రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులు, నమూనాలు (ఔశీతీఎఱఅస్త్ర వీశీవశ్రీం) మరియు ప్రయోగాలను ప్రదర్శిస్తారు. ఇది ూజువీ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్) అంశాలపై అవగాహన పెంచుకోవడానికి సహాయపడుతుందని అన్నారు... ఈ కార్యక్రమంలో చిత్ర ఇంద్రవటం.... డాక్టర్ ఉమా వెంకటేశ్వరి. డాక్టర్ వెంకటేశ్వరి.. డాక్టర్ కైసర్ జమీల్.. ఇతరులు పాల్గొన్నారు.

# హిమాయత్ నగర్ వేదికగా ముత్తూట్ గోల్డ్ పాయింట్ సెంటర్

హైదరాబాద్ : బంగారం, వెండి వ్యాపార రంగంలో ఒకటైన ముత్తూట్ పప్పచన్ గ్రూప్ అనుబంధ సంస్థ ముత్తూట్ ఎగ్జిమ్ (ప్రై) లిమిటెడ్ హైదరాబాద్లోని హిమాయత్నగర్ లో తన కొత్త గోల్డ్ పాయింట్ కేంద్రాన్ని ప్రారంభించినట్లు ప్రకటించింది. దీంతో దేశవ్యాప్తంగా సంస్థకు 95వ శాఖ కాగా, హైదరాబాద్లో 6వది. తెలంగాణలో 9వ కేంద్రం ద్వారా సేవలు అందిస్తోంది. లిబర్టీ ప్లాజా బిల్డింగ్, లోయర్ గ్రౌండ్ ఫ్లోర్, షాప్ నెం. 23 (రేమండ్ షోరూమ్ ఎదురుగా), హిమాయత్నగర్, ఈ కొత్త గోల్డ్ పాయింట్ కేంద్రం ద్వారా. పరిసర ప్రాంతాల వినియోగదారులకు పారదర్శక, శాస్త్రీయ, బాధ్యతాయుత బంగారం రీసైక్లింగ్ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి రానున్నాయి. వినియోగదారులు తమ పాత, ఉపయోగించిన బంగారు ఆభరణాలను సురక్షితంగా విక్రయించవచ్చు. మొత్తం మూల్యాంకన ప్రక్రియను కస్టమర్లు



ప్రత్యక్షంగా వీక్షించే విధంగా పారదర్శక విధానాన్ని సంస్థ అమలు చేస్తోంది.

రూ.10,000 వరకు విలువైన బంగారానికి తక్షణ నగదు చెల్లింపు అందించబడుతుంది. అంతకుమించిన మొత్తాలు IMPS, NEFT లేదా RTGS ద్వారా సురక్షితంగా నగదు బదిలీ చేయబడతాయి. విస్తరణపై వ్యాఖ్యానిస్తూ, ముత్తూట్ పప్పాచన్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మరియు ముత్తూట్ ఎగ్జిమ్ మేనేజింగ్ డైరెక్టర్ థామస్ ముత్తూట్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం బంగారం వ్యాపారం, ఆభరణాల తయారీలో విశిష్ట చరిత్ర కలిగిన ప్రాంతం. హైదరాబాద్ నగరం చారిత్రాత్మక, ప్రముఖ బులియన్ మార్కెట్గా పేరుపొందింది. హిమాయత్నగర్లో కొత్త కేంద్రం ప్రారంభించడం ద్వారా బంగారం రీసైక్లింగ్ రంగాన్ని మరింత క్రమబద్ధీకరించి, వినియోగదారులకు శాస్త్రీయ, పారదర్శక వేదికను అందించడమే మా లక్ష్యం.” అని తెలిపారు.

# తండ్రి మందలించాడని కుమారుడు అదృశ్యం



మేడిపల్లి, వాయిస్ టుడే న్యూస్, మర్చి 03 : తండ్రి మందలించాడని కుమారుడు అదృష్టమైన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడిపల్లి మండలం సత్యనారాయణపురం కాలనీలో నివసించే రామ్ శెట్టి శ్రీను (45) స్థానికంగా వాటర్ ప్లాంట్ బిజినెస్ నిర్వహిస్తున్నాడు.అతని కుమారుడు రామ్ శెట్టి మహేష్ (23) చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నాడని మందలించడంతో గత నెల 27న రాత్రి మహేష్ ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. వివిధ ప్రాంతాలలో వెతకిన ఆచూకీ లభించలేదు. తండ్రి శ్రీను మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి ధర్యాప్తు ప్రారంబించడం జరిగిందని మేడిపల్లి సీఐ ఆర్. గోవింద రెడ్డి తెలిపారు.

# మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులు పై కేసు నమోదు

మేడిపల్లి, వాయిస్ టుడే న్యూస్,మర్చి 03 : ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా హోలీ నాడు వివిధ ప్రాంతాలలో మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు.మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సురేందర్ నగర్ కాలనీ నారపల్లి కి చెందిన విశ్వనాథ్ అనే వ్యక్తి హోలీ పండుగ రోజు మద్యం అమ్ముతున్నాడనే సమాచారం తో దాడులు నిర్వహించడంతో సదరు వ్యక్తి మద్యం అమ్ముతూ పట్టుబడడంతో అతనిపై కేసు నమోదు చేయడం జరిగింది.అదే విధంగా కాచివాని సింగారం కి చెందిన రమేష్ అనే వ్యక్తి కూడా మద్యం విక్రయిస్తున్నాడని పక్క సమాచారంతో అతని వద్ద కూడా మద్యం పట్టుకున్నారు. వీరిరువురుపై కేసు నమోదు చేసి, వీరి వద్ద నుండి సుమారు ఐదు లీటర్ల మద్యాన్ని సీజ్ చేయడం జరిగిందని మేడిపల్లి ఎస్.హెచ్.ఓ ఆర్. గోవింద రెడ్డి తెలిపారు.



# సాయి ప్రియ కాలనీలో ఉచిత మెగా వైద్య శిబిరం

### వైద్య శిబిరాన్ని నిర్వహించిన లీత చారిటబుల్ ట్రస్ట్, ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ సంస్థ.

### ముఖ్యఅతిథిగా పాల్గొని ట్రస్ట్ సభ్యులకు అభినందనలు తెలిపిన తుంగతుర్తి రవి.

మేడిపల్లి, వాయిస్ టుడే న్యూస్,మర్చి 03 : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని పర్వతాపూర్ సాయి ప్రియ కాలనీ రోడ్ నెంబర్ 05 లో లీత చారిటబుల్ ట్రస్ట్, ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లీతా చారిటబుల్ ట్రస్ట్ పెద్దలు డాక్టర్ చిరంజీవి,డాక్టర్ కమల చిరంజీవి, పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆర్.వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి పాల్గొన్నారు. ఈ శిబిరంలో సుమారు 300 మందికి బిపి, షుగర్, రక్త పరీక్షలు, దంత పరీక్షలు, కంటి పరీక్షలు, ఎక్రే, ఈసీజీలతో పాటు గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు ప్రత్యేక వైద్య చికిత్సలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ, మానవసేవే మాధవసేవగా భావించి లీత చారిటబుల్ ట్రస్ట్, ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ఫౌండేషన్ సభ్యులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# మేడిపల్లిలో హోలీ పండుగ సంబరాలు

### పాల్గొన్న మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి.

మేడిపల్లి, వాయిస్ టుడే న్యూస్,మర్చి 03 : హోలీ పండుగ సందర్భంగా మేడిపల్లి 25వ డివిజన్లోని విహారికకాలనీ, సాయి హిల్స్, క్రాంతి కాలనీ, శ్రీ సాయి నగర్ కాలనీ లలో హోలీ పండుగ సంబరాలను ఆనందోత్సాహాల నడుమ మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి, కాలనీల అధ్యక్షా,కార్యదర్శులు, పెద్దలు యువకులు, పిల్లలు అందరూ సంతోషంగా ఒకరి కొకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు, ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి, ఈ రంగు రంగుల పండుగ హోలీ మీ జీవితంలో ఆనందాన్ని, సంతోషాన్ని నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# అసెంబ్లీ సమావేశాల్లో బీసీ రక్షణ చట్టం బిల్లు పెట్టాలి

### జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం



హైదరాబాద్, మార్చి 03: రాష్ట్రంలో బీసీల పై అగ్రకులాల దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. బీసీల సంక్షేమం, రక్షణ కోసం ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే బీసీ రక్షణ చట్టం బిల్లు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో ఆయన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో అగ్రకులాల దాడిలో ఇటీవల జరిగిన రెండు నెలల పసిపాప మరణించిందని, ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా ఉండాలంటే తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం తరహాలోనే బీసీల అట్రాసిటీ రక్షణ చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏదో ఒకచోట సాంఘిక బహిష్కరణలు, కులం పేరుతో దూషించి దాడులు చేయడం, అత్యాచారాలు హత్యలు చేయడం జరుగుతున్నాయని వీటిని ఎదుర్కోవడానికి బీసీ సమాజమంతా ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

# జహీరాబాద్ మున్సిపల్ సమస్యలపై ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సమీక్ష

## రంజాన్ ఏర్పాట్లు, వేసవి తాగునీటి సరఫరాపై అధికారులకు కీలక ఆదేశాలు



ఝరాసంగం (మార్చి 03) వాయిస్ టుడే : జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ సమస్యలపై స్థానిక శాసనసభ్యులు శ్రీ కొనింటి మాణిక్‌రావు, మున్సిపల్ కమిషనర్, అధికారులు మరియు కౌన్సిలర్‌లతో కలిసి విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి, ప్రజల సౌకర్యాల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు.

**పారిశుద్ధ్యం.మౌలిక వసతులు:** పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని, మంచినీటి సరఫరా మరియు విద్యుత్ వసతులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

**విలీన గ్రామాల అభివృద్ధి:** జహీరాబాద్ మున్సిపాలిటీలో నూతనంగా విలీనమైన గ్రామాల్లో కూడా పట్టణంతో సమానంగా అభివృద్ధి పనులు కొనసాగించాలని ఆదేశించారు.

**రంజాన్ ఏర్పాట్లు:** రానున్న రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మసీదులు, ప్రార్థనా మందిరాల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, వీధి దీపాల ఏర్పాటును తక్షణమే పూర్తి చేయాలని చెప్పారు.

**వేసవి యాక్షన్ ప్లాన్:** ఎండలు ముదురుతున్న నేపథ్యంలో పట్టణంలో మంచినీటి ఎద్దడి రాకుండా, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**పన్నుల వసూలు:** మున్సిపాలిటీకి రావాల్సిన పన్ను బకాయిల (Pending Taxes) వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి, లక్ష్యాలను తక్షణమే పూర్తి చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జైతు రామ్, కౌన్సిలర్లు తంజీమ్, గౌస్ గోరి, జాకీర్, జాహేద్ అలీ, మహిపాల్ యాదవ్, దీపక్ పాల్గొన్నారు. అలాగే మాజీ కౌన్సిలర్‌లు నామా రవికిరణ్, అబ్దుల్లా, మాజీ పట్టణ అధ్యక్షులు యాకూబ్, ప్రవీణ్ మరియు ఇతర మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



## అంగన్వాడీల అరెస్టును ఖండిస్తూ సిఐటియు నిరసన

కృష్ణా జిల్లా-గన్నవరం(వాయిస్ టుడే) : అంగన్వాడీ కార్మికుల అక్రమ అరెస్టును ఖండిస్తూ సీఐటీయు బాపులపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హనుమాన్ జంక్షన్ లో సంఘీభావ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరిన అంగన్వాడీ లను కూటమి ప్రభుత్వం అర్ధరాత్రి అక్రమంగా అరెస్ట్ చేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం అని ఆరోపించారు. విజయవాడ ధర్నా చౌక్‌లో నిరసన తెలిపిన అంగన్వాడీ కార్మికులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి, సత్తెనపల్లి, పెదవేగి తదితర ప్రాంతాలకు తరలించి ఇబ్బందులకు గురిచేశారని దీనిని సిఐటియు గా ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బేత శ్రీనివాసరావు, జిల్లా బిల్డింగ్ వర్కర్స్ అధ్యక్షుడు రాజనాల సురేష్, మండల వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి అబ్దుల్ బారి, టౌన్ బిల్డింగ్ అధ్యక్షుడు వడ్డీ గిరిధర్, గౌరవ అధ్యక్షుడు చింత సూరిబాబు, ఎలక్ట్రిషియన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా హోలీ వేడుకలు

రాయికల్( వాయిస్ టుడే): రాయికల్ పట్టణంలో మంగళవారం హోలీ వేడుకలను రాయికల్ ప్రెస్ క్లబ్ జె ఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక నాయకులు, యువజన సంఘాల సభ్యులతో కలిసి రంగులు చల్లుకుని శుభాకాంక్షలు తెలియజేశారు ఇట్టి సందర్భంగా సందర్భంగా రాయికల్ పురపాలిక చైర్మన్ కట్కం రవీందర్ మాట్లాడుతు హోలీ పండుగ సోదరభావం, ఐక్యతకు ప్రతీక అని అన్నారు. ప్రజలు సంతోషంగా, శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని సూచించారు. మరియు ఇట్టి సందర్భంగా ప్రెస్ క్లబ్ అభివృద్ధి కోసం కలివచ్చే పలువురు సహకారం అభినందనీయం అధ్యక్షులు చింతకుంట సాయికుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సింగిడి శంకరయ్య,కోశాధికారి కడకుంట్ల జగదీశ్వర్, ఉపాధ్యక్షులు సింగనీ శ్యామ్ సుందర్,యచమనేని కిరణ్ రావు,మాజీ అధ్యక్షులు వాసరి రవి మాజీ కోశాధికారి మచ్చ శేఖర్ సాంస్కృతిక కార్యదర్శి ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డి,సభ్యులు గుర్రాల వేణు,బొంగిని శ్రీనివాస్, నాగమల్ల శ్రీకర్,వాసం లింబద్రి,అను పురం లింబద్రి ,కల్లెం శ్రీనివాస్, గంగాధర సురేష్, తిగుళ్ళ గోపి,మాణిక్యం గంగాధర్,నరేష్,ఇమ్మడి విజమ్ గంట్యల ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం నియోజకవర్గం శాసనసభ్యులను కలిసిన సిపిఐ పార్టీ నాయకులు సయ్యద్ అమీర్



పాల్వంచ మార్చు 3 (వాయిస్ టుడే ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ సిపిఐ పార్టీ కార్యాలయంలో కొత్తగూడెం నియోజకవర్గం శాసనసభ్యులు కూనం నేని సాంబశివరావు ను ఇంద్ర నగర్ కాలనీ ఆరో డివిజన్ సిపిఐ పార్టీ నాయకులు సయ్యద్ అమీర్ కలిసి రంజాన్ మాసం పవిత్రమైన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు, ఈ సందర్భంగా ఆరవ డివిజన్ లోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే త్వరలోనే డివిజన్ వచ్చి ప్రజలను కలుస్తానని తెలిపారు.

## బీజేపీ కొత్తపల్లి జోన్ అధ్యక్షులు ముత్తునూరి హరీష్‌కి మేయర్ పరామర్శ



కరీంనగర్,మార్చి03(వాయిస్ టుడే): కొత్తపల్లి జోన్ అధ్యక్షులు ముత్తునూరి హరీష్ ప్రమాదవశాత్తు కాలుకు గాయం కావడంతో కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్ హరీష్ ను పరామర్శించారు. ఈ సందర్భంగా మేయర్ ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకొని ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్థానికనాయకులు,కార్యకర్తలకు మేయర్ కోలగని శ్రీనివాస్ ఈ సందర్భంగా హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు కేంచ శేఖర్,జిల్లా నాయకులు ఎర్రోళ్ల ప్రదీప్,ప్రధాన కార్యదర్శి కొప్పుల హరిప్రసాద్,గొపు మునీదర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.




## తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఉద్యోగుల హోలీ సంబురాలు

కరీంనగర్,మార్చి03(వాయిస్ టుడే): నగరంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రేకుర్తి శాఖ వద్ద హోలీ పండుగను మేనేజర్లు,ఆఫీసర్లు మరియు సిబ్బంది కలిసి ఉత్సాహంగా జరుపుకున్నారు. రంగుల హోలీతో పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ సోదరభావం,ఐక్యతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ చీఫ్ మేనేజర్ జలంధర్ రెడ్డి, సీనియర్ మేనేజర్ రమణ రెడ్డి,యూనియన్ నాయకులు ప్రవీణ్ రెడ్డి,మెరుగు ప్రవీణ్,కళ్యాణ్,కిరణ్,ప్రశాంత్, తిరుపతి,శేఖర్,బంగారు బాబు, అశోక్, బాలకిషన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు హోలీ పండుగ సంతోషం, స్నేహం,ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. ఉద్యోగుల మధ్య పరస్పర అవగాహన, సమన్వయం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.

## జిల్లా ఇంచార్జి మంత్రిని కలిసిన హనుమకొండ జిల్లా కలెక్టర్



హనుమకొండ జిల్లా,వాయిస్ టుడే: ఇటీవల హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్ పాయ్ మంగళవారం హైదరాబాద్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి,రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ,సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలియచేసిన మంత్రి పొంగులేటి జిల్లాలో ప్రజా సంక్షేమం,అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆకాంక్షించారు.



## సచివాలయంలో కలెక్టర్ల సదస్సు

### – సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య హాజరు

సంగారెడ్డి (వాయిస్ టుడే ప్రతినిధి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం హైదరాబాద్ సచివాలయంలో కలెక్టర్లతో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రాభివృద్ధి లక్ష్యాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో వేగవంతమైన చర్యలు, సంక్షేమ పథకాల అమలు, పరిపాలనా పారదర్శకత తదితర అంశాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. జిల్లాల వారీగా పనితీరు మెరుగుపరచి, ప్రభుత్వ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయాలని కలెక్టర్లకు సూచించారు. సదస్సులో కలెక్టర్ పి.ప్రావీణ్య పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సేవల అమలు పురోగతిపై వివరించారు. జిల్లాలోని ప్రాధాన్య సమస్యలను గుర్తించి, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ల సదస్సుకు పలువురు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, చిన్నా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు హాజరయ్యారు.



## దమ్మయాత్ర భిక్షువులచే బుద్ధ వనములో ప్రత్యేక ప్రార్థనలు

### నాగర్జున కొండను సందర్శించిన బౌద్ధ భిక్షువులు

నాగార్జునసాగర్, మార్చి, 3 (వాయిస్ టుడే): దమ్మ పాదయాత్ర బౌద్ధ భిక్షువులు బుద్ధ వనములోని ధ్యాన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు పూజలు నిర్వహించారు. కర్ణాటక గుల్బర్గా బుద్ధ విహార నుండి ప్రారంభమైన దమ్మయాత్ర బుద్ధవనం చేరుకొనిన దమ్మయాత్ర ముగింపు ఉత్సవాలలో భాగంగా మంగళవారం గగన్ మాలిక్ ఫౌండేషన్ అధ్యక్షులు గగన్ మాలిక్ ఆధ్వర్యంలో మహస్తూపంలోని ధ్యాన మందిరంలో థాయిలాండ్ దేశం నుంచి తీసుకొచ్చిన ప్రత్యేక సామాగ్రి తో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ బుద్ధునికి బుద్ధ జ్యోతులను వెలిగించారు. అనంతరం ధ్యాన మందిరంలో ధ్యానం చేశారు. ఈ కార్యక్రమం అనంతరం ధమ్మా యాత్రలో పాల్గొన్న థాయిలాండ్, భారతదేశానికి చెందిన బౌద్ధ భిక్షువులు ఇతర బౌద్ధ మతస్తులు థాయిలాండ్ రాజ కుటుంబంతో కలిసి నాగార్జునకొండ మ్యూజియాన్ని సందర్శించారు. నాగార్జునకొండ మ్యూజియంలో మ్యూజియం క్యూరేటర్ కమలహాసన్ బౌద్ధ భిక్షులందరికీ మ్యూజియంలో భద్రపరిచిన బుద్ధ ధాతువులను వీక్షించే అవకాశాన్ని కల్పించారు. నాగార్జునకొండ మ్యూజియంలో భద్రపరిచిన బుద్ధ దాతువులను దర్శించి బౌద్ధ భిక్షువులు, బౌద్ధ మతస్తులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం వీరు నాగర్జున కొండలోని పునర్నిర్మిత మహాస్థూపాన్ని, సింహల విహారాన్ని సందర్శించారు. వీరితోపాటు బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర, బుద్ధవనం ఆర్ట్స్ మరియు ప్రమోషన్స్ మేనేజర్ శ్యామ్‌శ్రీ సుందర్ రావు , స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## అధికారుల అలసత్వం, రైతన్నల కష్టాలు

శాయంపేట(వాయిస్ టుడే): మండల రైతులకు నీటి కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీరు వస్తున్న మండలానికి నీటిని అందించడంలో అధికారులు విఫలవుతున్నారు. గత కొన్ని రోజులుగా నిర్విరామంగా ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీరు వస్తున్న ఊరుగొండ సమీపంలో జాతీయ రహదారిపై సదరు కాంట్రాక్టర్ నిర్మించిన కల్వర్టు నిర్మాణం పూర్తి అయిన తాత్కాలికంగా వేసిన సిమెంట్ పైపులను తొలగించక పోవడంతో వాటిలో కాంక్రీట్, చెత్తతో నిండి శాయంపేట మండల రైతులకు నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. రైతులే సమస్యలను వెతుకుంటూ నీటికోసం ప్రమాదాలకు ఎదురెళ్లవలసి వస్తుంది. కాలువలు సరైన మరమ్మతులు లేక మరియు చెట్ల కొమ్మలు , చెత్త చెదారంతో నిండి నీటి ప్రవాహానికి అడ్డుగా ఏర్పడి ఉన్నాయి. కనీసం కాలువలను పర్యవేక్షించే అధికారులు మా మండలంలో ఉన్నారా లేక ఉండి నిద్రమత్తులో ఉన్నారా అని రైతులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సారెస్పీ మరియు ఇరిగేషన్ అధికారులు సమస్యకు సత్వరమే పరిష్కారం చూపకపోతే ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని ఈ సందర్భంగా రైతులు హెచ్చరించారు.

## పారిశుద్ధ్య కార్మికులు నిజమైన సేవాదారులు

### 47వ డివిజన్ కాంగ్రేస్ నాయకులు సందెల విజయ్

### పారిశుద్ధ్య కార్మికులతో కలిసి హోలీ సంబరాలు

కాజీపేట,వాయిస్ టుడే: "ప్రతిరోజూ వాడవాడకి,నగరానికి స్వచ్ఛతను అందిస్తూ ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్న పారిశుద్ధ కార్మికులు నిజమైన సేవాదారులు అని 47వ డివిజన్ కాంగ్రేస్ నాయకులు,కాంటెస్ట్ కార్పొరేటర్ సందెల విజయ్ అన్నారు. హోలీ పండుగ సందర్భంగా కాజిపేట 47వ డివిజన్‌లో విజయ్ ఆధ్వర్యంలో ఘనంగా హోలీ పండుగ వేడుకలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా మునిసిపల్ కార్మికులతో కలిసి హోలీ సంబరాలు జరుపుకున్నారు. రంగుల పండుగను కార్మికులతో కలిసి జరుపుకోవడం ద్వారా వారిపై తనకున్న గౌరవం,అభిమానాన్ని విజయ్ వ్యక్తం చేశారు. కష్టపడి చేసే సేవల వల్లనే మన నగరం పరిశుభ్రంగా,అందంగా కనపడుతుందని..అలాంటి మహోన్నత సేవ చేస్తున్న వారితో కలిసి హోలీ పండుగను జరుపుకోవడం నాకు ఎంతో ఆనందంగా ఉంది" అని,పండుగ రోజుల్లో కూడా విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసే కార్మికులను అభినందిస్తూ వారి సంక్షేమం కోసం వారి తరుపున తాను ఎల్లప్పుడూ ముందు ఉంటానని అన్నారు. నగర అభివృద్ధి, పరిశుభ్రత పరిరక్షణలో పారిశుద్ధ కార్మికుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ హోలీ వేడుకల్లో కార్మికులు,స్థానిక నాయకులు,యువత పెద్ద సంఖ్యలో పాల్గొని పరస్పరం రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ మునిసిపల్ జవాన్ సాగర్, సుశీల్, సంజీవ, మహేష్, రవి, సంపత్, రాజయ్య, స్వప్న, శాంత, రజిత,స్థానికులు పాల్గొన్నారు.

